## యూనిట్ సభ్యుల చిత్రం !

నమ్ముకున్న మనుష్యులకు బంగారు భవిష్యత్తు ఏర్పరచడం కోసం జగపతి అధినేత ఒక బంగారు పథకాన్ని ఆలోచించారు. అదేమిటన : గత దశాబ్దన్నరగా తన సంస్థలో పనిచేస్తున్న వారల నిమిత్తం ఒక చిత్రాన్ని నిర్మించ తలపెట్టారు. పనివారలందరికీ భాగాలుయిచ్చి, (పెట్టుబడి నిర్మాతదే) చిత్రం ద్వారా వచ్చే లాభాలను వాళ్లకే పంచిపెట్టడానికి నిశ్చయించారు. కథనుకూడా తనే వ్రాశారు.

## పి చ్చి మా రా జు

జగపతి రాజేంద్ర ప్రసాద్ వ్రాసిన కథ యిది. ఇది రంగులలో నిర్మితమవుతుంది. ఇందులో నటించడానికి నటీనటులు తక్కువ పారితోషికం తీసుకుంటారట. అలాగే సాంకేతిక వర్గంకూడా.

"బంగారు బొమ్మలు" పూర్తయిన పిమ్మట "పిచ్చి మారాజు" ప్రారంభమవుతుంది. ఈ చిత్రానికి ఆత్రేయ రచనను, మహాదేవన్ సంగీతాన్ని, వెంకటరత్నం ఛాయను నిర్వహిస్తారు. కథ, సినిమానువాదం, దర్శకత్వంను వి. బి. రాజేంద్ర ప్రసాద్ చేపట్టారు.

యూనిట్‌సభ్యులకోసం, ఒకచిత్రాన్ని నిర్మించి, వాళ్లకు సమ భాగాలిచ్చి, వచ్చే ఆదాయాన్ని పంచిపెట్టడం అనేది అందరికీ సాధ్యపడేదికాదు అది ఒక్క రాజేంద్ర ప్రసాద్‌కు మాత్రమే చేతవుతుంది.

## కొత్త పాత్రలో పాతమ్మాయి

"ఎవరికివారే యమునాతీరే" చిత్రంలో నాయిక వేషానికి కొత్తమ్మాయి కావాలి అని రెండు వారాల క్రితం నేనే వ్రాశాను. ఆ వార్త వచ్చిన అయిదు రోజులకల్లా కొత్తమ్మాయికి అనుకున్న పాత్రను చంద్రకళ కిచ్చినట్టు, దర్శకుడు దాసరి చెప్పారు.

చంద్రకళ గుడ్డిపిల్లగా నటిస్తున్నది. రాజబాబు నాయకత్వం వహించే యీ చిత్రంలో సావిత్రి, దేవిక, రమాప్రభ, నిర్మల, సత్యనారాయణ, ప్రభాకర రెడ్డి, అల్లు రామలింగయ్య, మాడా, శ్రీరాజ్, చిట్టిబాబు ముఖ్య పాత్రధారులు. దిడ్డికుమార్ (శ్రీహరిరావు అబ్బాయి) నిర్మిస్తున్న యీ చిత్రానికి నారాయణరావు మాటలను రచించారు.

— శ్రీవిహాప్ ●

"బంగారు కలలు"లో ఒక దృశ్యం






గంగయ్య గంగిగోవులాంటి మనిషి కానే కాదు. ఈ విషయం ఆ వూళ్లో చాలా మందికి తెల్సు. అయినా అతను ఎదరపడినప్పుడు మాత్రం గంగిగోవులా భావించి పూజిస్తారు. ఎందుకంటే అతను చాలా పలుకుబడి గలవాడు. అతనెప్పుడూ బడికెళ్లి అ ఆ లు కూడా చదువుకోలేదు. బడికెళ్లి బాగా చదువుకున్నవాడికంటే, పలుకుబడి గలవాడే గొప్ప అని చిన్నప్పుడే ఎవరో మంత్రోపదేశం చేసి పుణ్యం కట్టుకున్నారు. అప్పట్నుంచి పలుకుబడికోసం రకరకాల పలుకులు పలికి, పనులు చేసి డబ్బు సంపాయించాడు.

గంగయ్య అన్నిరకాల వ్యాపారాలూ చేస్తాడు. అతనికి తెలియని వ్యాపారం లేదు. ముఖ్యంగా మనిషికి కావాల్సిన తిండి, బట్ట, ఇల్లు వాటికి సంబంధించిన వ్యాపారాలు చేస్తాడు. అన్ని సరకులూ అమ్మే పెద్ద షాపు వుంది. అలాగే ఒక పెద్ద బట్టల షాపు వుంది. కలప, పెంకు, ఇటుక, సిమెంటు, ఇలా ఒక్కోదానికి ఒక్కో కొట్టు వుంది.

గంగయ్య చాలా తియ్యగా మాట్లాడతాడు. (అతని ఒంట్లో షుగరుంది.) అతగాడి మాటల తియ్యదనానికి అవతల వాడికూడా షుగర్ కంప్లయింటు వచ్చేస్తుంది. ఎంత మంచివాడిచేతనైనా సరే తియ్యటి మాటల్జెప్పి చెడ్డ పని చేయించగల సమర్థుడు. నాలుగు పలుకులు పలికి ప్రవరాఖ్యుడ్ని వరూథిని దగ్గరకు పంపేయగలడు. అర్ధరాత్రిన పెళ్లాం బిడ్డల్ని వదిలేసి వెళుతున్న బుద్ధుడ్ని వెనక్కి పిలుచుకురాగలడు. శ్రీరాముడికి మరో పెళ్లి చేయగలడు. ఏడుకొండలవాడిచేత కుబేరుడితో 'నీకు నేను దమ్మిడీ బాకీ లేను, నీ తాతతో చెప్పుకో పో !' అనిపించగలడు.

ఇవన్నీ చేయగలడు. గలడే కాదు, చేస్తాడు. తనకోసం, తన రాబడికోసం, పలుకుబడికోసం చేస్తాడు. అలా అన్నీ పెంచుకొని ఎన్నికల్లో నిలబడి, పదవుల నలంకరించి, పదికాలాలపాటు అతని పేరు ప్రతినోటా పలకాలని అతని ఆకాంక్ష.

గంగయ్య అచిరకాలంలోనే బాగా డబ్బు సంపాయించాడు. అలా సంపాయించిన లక్ష్మీదేవిని వివిధ రూపాల్లో (ఉదా : వజ్రాలూ, బంగారం, నోట్లు వగైరా) బంధించాడు. లక్ష్మీదేవి కూడా హాయిగా అతనింట్లో ఇనప్పెట్టెల్లోనూ, గోడ అరల్లోనూ విశ్రాంతి తీసుకుంటోంది.

లక్ష్మీదేవికి చేతులు మారాలంటే మహచిరాకు. బీదవాళ్ల దగ్గరికీ, నెల జీతాలు తెచ్చుకుని బ్రతికే మధ్య తరగతి వాళ్లదగ్గరికీ వెళ్లదు. ఎందుకంటే, వాళ్ళు లక్ష్మీదేవిని దాచిపెట్టి విశ్రాంతి తీసుకోనివ్వరు, వెంటనే పంపేస్తారు గాబట్టి. అదే బాగా ధనవంతులు యిళ్ళల్లోనయితే, బోల్డుకాలం ఎంచక్కా విశ్రాంతి తీసుకోవచ్చు. అందుకే లక్ష్మీదేవి గంగయ్యని వదిలిపెట్టదు.

గంగయ్య చిరకాలకోరిక ఏమిటంటే, ముందు చెప్పినట్టుగా ఎన్నికల్లో నిలబడి పదవి నలంకరించడం. రోజూ పేపర్లో తన ఫొటో చూసుకోడం సన్మానాలూ, సభలూ, రిబ్బన్లు కత్తిరించడాలూ, వగైరాలు చూసుకోడం. మరి దీనికి బోల్డు డబ్బు గావాలి. ముందు ఎన్నికల్లో నిలబడాలంటే బోల్డు డబ్బు కావాలికదా. డబ్బు లేకుండా ఎన్నికల్లో నిలబడతానంటే జనం వూర్కోరుగదా. కూలీ నాలీ చేసుకొని బతక్క ఎన్నికల్లో నిలబడతాట్ట, ఎన్నికల్లో అని కోప్పడతారు. డిపాజిట్టు కట్టడానికి కూడా డబ్బు కావాలి, మంచి తనాన్ని డిపాజిట్టు చేయడానికి రూల్సు ఒప్పుకోవుగద మరి.

అందుచేత — గంగయ్య డబ్బు సంపాయించడం మొదలెట్టాడు. అలా బాగా బాగా సంపాయించి

ఓ విమానం అద్దెకు తీసుకొని పైనుండి తన నియోజకవర్గం మీద నోట్లు విసిరి ఓడిపోకుండా గెలవాలని అతని వుద్దేశం. మొదటిసారి గెలవకపోతే మళ్లీ నాలుగేళ్ళో అయిదేళ్లో (అతనికి సరిగ్గా తెలియదు) ఆగాలి. అందాక అతను ఆగలేడు. చాలా తొందరగా పైకి వెళ్ళిపోదామనుకుంటున్న మనిషి మరి. కాలం వృధా చేయకూడదనే కదా అతను బళ్ళోకి కూడా వెళ్ళలేదు.

అసలు సంగతి చెప్పుకోవాలి, అదే అతను డబ్బు ఎలా సంపాయిస్తున్నాడా అన్నది.

వ్యాపారం న్యాయంగా చేస్తే దాన్ని వ్యాపారం అనరు. పరోపకారం అంటారు. అన్యాయంగా చేసేదే వ్యాపారం. కొందరు 'మరీ అన్యాయంగా' చేస్తారు వ్యాపారం. ఆ కోవకి చెందిన వాడిల్లో ప్రథముడుగా చెప్పుకోవచ్చు గంగయ్యని.

అతను వున్న సరుకు వున్నట్టుగా అమ్మడు. అసలు సరుకులో మరోటి కలిపి అమ్ముతాడు. ఏవిటేదీ అని ఎవరూ అడగరు. అడిగితే, నవ్వి 'కలియుగం అంటే కల్తీ అని అర్థం' అంటాడు.

'కల్తీ చేయకపోతే ప్రజలు ఆరోగ్యంగా వుంటారు. అప్పుడు చావులుండవు. డాక్టర్లకి పనుండవు. కేవలం పుట్టుక లుంటాయి. దానివల్ల అసలే అర్థంకాకుండా వున్న ఆర్థిక విధానం అల్లకల్లోలమయి పోతుంది. జనాభా ఎక్కువయి రెండు కాళ్లమీద నిలబడ్డానికి చోటులేక ఒంటి కాలిమీద నిలబడాల్సి వస్తుంది.'

'కల్తీ అనేది ముఖ్యం. ఒక్కోసారి కల్తీ బాగా పనిచేస్తుంది. ఉదాహరణకి ఒకే రక్తం మనుషులకి పెళ్లి చేస్తే పనికిరాని పిల్లలు పుడ్తారు. అదే వెరొక రక్తం మనుషులను కలిపితే మంచి తెలివైన పిల్లలు పుడ్తారు. చిన్నప్పుడు నా కాల్లో ఎముక విరిగితే మరో జంతువు ఎముక వాడారు. మామూలు కాలికన్నా కల్తీ ఎముక కాలే బలంగా వున్నట్టు అనిపిస్తుంది.

ఇలా చెపుతుంటాడు

అతనితో పనివున్నవాడు అవుననక తప్పదు. గంగయ్య కూడా తనతో పనివున్నవాడికి మాత్రమే ఈ కల్తీ సంగతులు కల్తీలేకుండా ఖచ్చింతంగా మాట్లాడతాడు.

## కల్తీ

గంగయ్య కల్తీ చేసేప్పుడు కొన్ని ప్రయోగాలు చేస్తాడు. అదేవిటంటే కల్తీ సరుకు (తిండికి సంబంధించిన సరకులు) తిన్న మనిషి వెంటనే అర్జంటుగా చావకుండా, రోజుకి ఓ చెంచాడు ప్రాణం బయటికిపొయ్యే విధంగా కల్తీ చేస్తాడు. అతని సరకులు తిన్నవాళ్లు వెంటనే చస్తే ప్రమాదం గదా మరి జనాభా పెరుగుదల నివారణ నిమిత్తం అని సంజాయిషీ చెప్పుకున్నా ఎవరూ వినరుగదా, అందుకన్నమాట.

మిగతావాటి గురించి ఇక్కడ అనవసరం. నూనె, నెయ్యిలో అతను చేసే కల్తీ గురించి మాత్రం ఇప్పుడు అవసరం.

మంచినూనెలో, నెయ్యిలో మరో చెడ్డనూనె, చెడ్డనెయ్యి కనిపెట్టి కలిపాడు. తన పేటలో వున్న చంద్రయ్య అనే మిఠాయి దుకాణం వాణ్ణి పిలిచాడు. సంగతి చెప్పాడు. మామూలు రేటుకన్నా సగం ధరకు, నూనె, నెయ్యి ఎట్టుకుపొమ్మన్నాడు. అన్ని రకాల వంటలూ చేసి అమ్మమన్నాడు.

చంద్రయ్య కూడా పాపం పైకిరావాలని కాంక్ష గల మనిషి. అందుకనే గంగయ్య చెప్పింది విని గంగిరెద్దులా తలూపి కొత్తరకం నూనె, నెయ్యి పట్టుకుపోయి, బజ్జీల దగ్గర్నుంచీ, బాదుషా వరకు తయారుచేసి దుకాణంలో పెట్టాడు.

* * *

చంద్రయ్య మిఠాయి దుకాణం బడికి చాలా దగ్గర. బళ్లో పిల్లలంతా అక్కడికొచ్చి కొంటుంటారు. చంద్రయ్య కొట్టు ప్రక్కనే మరో మిఠాయి కొట్టు వుండేది. అది సుబ్బయ్యది. సుబ్బయ్య చేసే ప్రతి పదార్థం పసందుగా వుండేదని ప్రతీతి. బళ్ళో పిల్లలందరూ అతని దగ్గరే కొనేవాళ్ళు. చంద్రయ్య దగ్గరికి ఎవరూ వెళ్ళేవారు కాదు. ఆ విధంగా చంద్రయ్య సుబ్బయ్యతో పోటీ చేయలేకపొయ్యేవాడు. కానీ గంగయ్య దయవలన ఉపదేశము పొంది, అతనిచ్చిన తక్కువరేటు నూనె, నెయ్యిలతో పదార్థాలు తయారు చేసి అమ్మడం మొదలెట్టాడు. దాంతో అందరూ చంద్రయ్య దగ్గర కొనడం మొదలెట్టారు. పాపం సుబ్బయ్య కొట్టూ, నోరూ మూసుకున్నాడు.

ఇక చంద్రయ్యకు పోటీ లేకపొయ్యింది. విజృంభించడం ప్రారంభించాడు. చిన్న దుకాణం అల్లా పెద్ద దుకాణం అయింది. వ్యాపారం పెరిగింది.

బళ్ళోపిల్లలు (డబ్బు వున్నవాళ్ళు మాత్రం) తెగ కొనుక్కుని తినడం మొదలెట్టారు — అన్నీ చౌక కావడంతో. కొంతమంది పిల్లలు రోజూ కొనుక్కోలేకపోయినా అప్పుడప్పుడూ కొనుక్కునే వాళ్ళు.

సోము రోజూ కొనుక్కుని తినేవాడు. వాళ్ల అమ్మా నాన్నకి లేక లేక కలిగినవాడు గావడంచేత రోజూ నాలుగైదు రూపాయలు తెచ్చుకొని చంద్రయ్య కొట్లో స్వీట్లూ, హాట్లు కొనుక్కుని తినేవాడు. ఎక్కువ డబ్బు తెచ్చినప్పుడు, మిగతా వాళ్లకు కూడా పంచేవాడు. సోము తల్లి అతనికి ఏనాడూ డబ్బు ఇవ్వడం మానలేదు. ఎప్పుడైనా మానితే ఎలా వుండేదో ?

* * *

ఏనుగులాంటి గంగయ్య ఏకులా అయిపోయాడు — డాక్టర్ చెప్పింది విని.

'ఏం చేసినా లాభం లేదండి. కాళ్ళూ చేతులూ పడిపోయాయి. ఎక్కువ కాలం బ్రతకడు కూడా.' అన్నాడు డాక్టర్ సోముని పరీక్షించి.

గంగయ్య గోలపెట్టాడు.

'ఏమైనా మరి కొద్దికాలం బ్రతకాలంటే ఈ మందులు వాడండి' అని వ్రాసియిచ్చాడు డాక్టర్.

'కల్తీ మందులు అమ్ముతారు జాగ్రత్త. కాని వాటిని వాడేముందు నాకు చూపించండి' అని హెచ్చరించి వెళ్ళిపోయాడు డాక్టర్.

ఎప్పుడూ ఏడవని గంగయ్య ఏడ్చాడు ఆ క్షణం. ఎందరినో పరోక్షంగా ఏడ్పించిన గంగయ్య ఏడ్చాడు ఆ క్షణం. అది చెడుకి చెప్పుదెబ్బ తగిలిన క్షణం.

'నాయనా సోమూ ! నా తండ్రీ ! లేక లేక కలిగిన బిడ్డవి. నిన్ను ఎంతో పెద్దవాడ్ని చేద్దామనుకున్నాను. విదేశాలకి పంపించి ఇంజనీరుగా ఇండియాకు రప్పిద్దామనుకున్నాను. నా డబ్బూ, పలుకుబడీ నీకోసమేరా ! నేను గొప్పవాడ్నయి నిన్ను మరింత గొప్పవాడ్ని చేద్దామనుకున్నాను చివరికి నిన్ను అవిటివాడ్ని చేసాను.' అని నెత్తీ నోరూ బాదుకున్నాడు గంగయ్య.

## 'వేసవి'

### జె. విప్లవకుమార్

చండ భానుని గుండె
కనలి, అనలము నిండి,
ఒక కొమ్మ నింకొకటి
ఒరసి, రాసుకు మండి...

కర్కశార్కుని 'గ్రీష్మ
రథము' గతులను తప్పి,
వాసుంధరా ధరము
వణికి, నాల్కలు సాపి...

వాడలో ఒక మ్రోడు
తనకు మిగిలిన ఒక్క
స్నేహితుడు— 'తన నీడ'
ఏడి ? యేడని ఏడ్చి...

ఇసుక మేటలు విచ్చి
సెలయేరు జీర్ణమై,
ధాత్రి చెక్కిటి మీద
కన్నీటి చారికై...

జాబిల్లి వెల్గుకై,
జడివాన జల్లుకై,
హరివిల్లు హేలకై
లోక మల్లల్లాడి...


## కొత్త సీరియల్ !

# ...రెండు పువ్వులు

**ఉత్తర, దక్షిణ, భారత దేశాలమధ్యగల నైసర్గిక విభేధాలను చెప్పకుండా, నైతిక విలువలపై వ్యాఖ్యానించకుండా, యీ రెండు ప్రాంతాల మనుషుల మనసులలోకి తొంగిచూసి వారి అంతరంగపు టంచులమధ్య గల అంతరాన్ని కొలుస్తూ అభిరుచుల, అలవాట్ల వైవిధ్యాన్ని పాత్రలలో పొందుపర్చుతూ సాగిపోయే కథనం : శ్రీమతి 'రాధా రాఘవ్' కలంతో చిత్రిత పట్టిన 'ఢిల్లీ బొమ్మలు', 'పల్లె బొమ్మలు' : 31-5-74 సంచిక ఆంధ్ర సచిత్ర వార పత్రిక నుంచీ పాఠకుల ముందుంటాయి !**

**సం॥**